క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్‌తోఫా అందజేత



కంచికచర్ల: ముస్లింల ఉన్నతికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ముస్లిం చైతన్య వేదిక నాయకులు దుబాయ్ కరీముల్లా అన్నారు. మండలంలోని గొట్టుముక్కల, గండేపల్లి, కీసర తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ సహకారంతో శుక్రవారం ముస్లింలకు కరీముల్లా రంజాన్‌తోఫా అందజేశారు. నియోజకవర్గంలోని పేద ముస్లింలకు 28 రకాల నిత్యావసర సరుకులను తోఫాగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, న్యాయవాదులు మంగలపూడి సన్నీ, సైదా, కోటిబాబు, ఎంపీటీసీ సభ్యులు గుదే సరస్వతి, పిల్లి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



నందిగామ: పట్టణంలో నెహ్రూనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి పలు రకాల విశేష పూజలు చేశారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత పలు రకాల హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కంటి పరీక్షలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత కంటి వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మూడవ విడత కంటి పరీక్షలను నిర్వహించారు. స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్‌లోని వార్డ్ సచివాలయంలో చేపట్టిన కంటి వైద్య శిబిరానికి పలువురు అవ్వాతాతలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి శుక్లాలు ఉంటే ఉచితంగా ఐఓఎల్ ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. డయాబెటిక్ వారికి నీటికాసులు (గ్లకోమా) వంటివాటికి ఉచితంగా వైద్యం అందిస్తారని చెప్పారు.

సేవే పరమావధి

- ఆర్‌ఎంపీ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం పంపిణీ
- సంచార చలివేంద్రం ఏర్పాటు



సంచార చలివేంద్రం ద్వారా మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నందిగామ: నందిగామలో ఓ ఆర్‌ఎంపీ(రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్) సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు. బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటుచేసి తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం అందజేస్తున్నారు.

శ్రీ శ్రీనివాస చారిటీస్ పేరుతో సేవలు

శ్రీ శ్రీనివాస నిలయం చారిటీస్ పేరుతో 2015లో విజయవాడ నివాసి కటకం శ్రీనివాస చారితో కలిసి నందిగామ పట్టణానికి చెందిన ఆర్‌ఎంపీ కొత్తపల్లి సత్యనారాయణ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. నాటి నుంచి ముందుగా విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీలో పేదవారి కోసం అనేక సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆ తర్వాత ఇప్పటివరకు పలు విధాలుగా సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. వారు సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ పలువురి అభినందనలు పొందుతున్నారు.

ప్రత్యేక వాహనంలో..

చారిటీస్ ఆధ్వర్యంలో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారు తాజాగా ఈ ఏడాది నందిగామలో సంచార చలివేంద్రాన్ని ప్రారంభించారు. రూ.2 లక్షల నిధులతో ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో నందిగామ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలకు చల్లటి తాగునీటితో పాటు నిత్యం మజ్జిగ, నిమ్మరసం అందజేస్తున్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మధ్యాహ్నం జాతీయ రహదారి పక్కనే ఉండి వచ్చి పోయే బాటసారులకు వీటిని పంపిణీ చేస్తున్నారు. తాగునీటితోపాటు నిత్యం వేలాది లీటర్ల మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేస్తున్నారు.

సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం



సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఎనిమిదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ ఏడాది నుంచి మరో అడుగు ముందుకు వేసి ముందుగా నందిగామలో రూ.2 లక్షల వ్యయంతో సంచార చలివేంద్రాన్ని ఏర్పాటు చేశా. నీటితోపాటు రోజుకు 2 వేల లీటర్ల మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేస్తున్నాను. ఈ కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగిస్తాం. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తాం.

– కొత్తపల్లి సత్యనారాయణ, నందిగామ

నిరుపేదలకు ఆర్థిక భరోసా



లబ్ధిదారులనడిగి సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వవిప్ ఉదయభాను



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రభుత్వ విప్ ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అల్లూరు, చందర్లపాడు మండలం కాసరబాదలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి అభివృద్ధి పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుపేదలకు అర్హతను బట్టి కాకుండా జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేమిరెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషం

చిట్టేల(వత్సవాయి) : సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. శుక్రవారం రెండో రోజు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల దగ్గరకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు వస్తున్న తీరు గురించి అడిగారు. గతంలో పథకాలు కావాలంటే ఎమ్మెల్యేతోపాటు గ్రామ నాయకుడు, జన్మభూమి కమిటీ సభ్యులు సంతకాలు ఉంటేనే వచ్చేవన్నారు. అవి కూడా కేవలం వారి పార్టీ వారికి మాత్రమే వచ్చేవని చెప్పారు. కానీ నేడు దానికి భిన్నంగా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో మార్నెళ్ల అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మార్నెళ్ల పుల్లారెడ్డి బ్రదర్స్, సర్పంచ్ జాల పెద్దకోటేశ్వరరావు, ఎంపీటీసీ కొదమల తేజశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

నువ్వే మా నమ్మకం భవిష్యత్తు జగనన్న కార్యక్రమం మండలకేంద్రం పెనుగంచిప్రోలులో శుక్రవారం ముగిసిన నేపథ్యంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యాన గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు వేల్పుల రవికుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలందరికీ పథకాలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లూరు(వీరులపాడు): నవరత్నాల పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పేర్కొన్నారు. అల్లూరులోని మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొంత మంది కావాలనే బురదజల్లే పనులు చేస్తున్నారన్నారు. ఏ కుటుంబంలో సంక్షేమ పథకాలు అందలేదో చెబితే బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. అల్లూరులో ఒకే కుటుంబంలో సుమారు రూ. 10 లక్షల మేర లబ్ధి పొందినా ప్రభుత్వం నుంచి ఏ పథకం రాలేదని గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు దృష్టికి తీసుకరావటం మాట్లాడటం బాధాకరమన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ఆ గృహానికి చెందిన వలంటీర్‌ను పిలిచి వివరాలు అడగ్గా రూ. 10 లక్షల మేర లబ్ధి చేకూరినట్లు వివరించారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. సమావేశంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చోటా ఆదరణ

నందిగామ: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రతి గడపలోను మంచి ఆదరణ లభించిందని పార్టీ 18 వ వార్డు కన్వీనర్ బండారు వెంకట్రావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డు పరిధిలో 1012 ఇల్లు ఉన్నాయి. అవార్డులో ఈనెల 7వ తేదీన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం శుక్రవారం రాత్రితో ముగిసింది. కార్యక్రమంలో పలువురు నేతలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూముల రీసర్వే

కంచికచర్ల : రెవెన్యూ గ్రామాలైన పేరకలపాడు, పెండ్యాల, బత్తినపాడు, సైదాపురం, గండేపల్లి గ్రామాల్లో శుక్రవారం జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే పనులు చేస్తోందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి శుక్రవారం అన్నారు. ఆమె మాట్లాడుతూ డ్రోన్లతో రీ సర్వే చేస్తున్నామని కచ్చితమైన హద్దులు, కొలతలు వస్తాయన్నారు. మండలంలోని పరిటాలలో ఇప్పటికే రీ సర్వే పనులు చేపట్టి సర్వే హద్దురాళ్లను కూడా పాతుతున్నామని చెప్పారు. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. రైతులు, కౌలురైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, సర్వేయర్ బసవరావు, రైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు(వత్సవాయి): పెనుగంచిప్రోలులోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విరాళం అందించారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన జోగుపర్తి లక్ష్మణరావు, విజయలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్‌కు అందజేశారు.

నష్ట పరిహారం అందించడానికి చర్యలు

జేసీ సంపత్‌కుమార్



భూముల లేఅవుట్‌లను పరిశీలిస్తున్న జేసీ

నందిగామ: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అవసరమైన భూముల సేకరణకు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో రవీంద్రరావుతో కలిసి శుక్రవారం నందిగామ మండలంలో పర్యటించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో మండలంలోని అంబారుపేట సమీపంలో అవసరమైన భూములు సేకరించినందుకు, మార్కెట్ ధరను నిర్ధారించడానికి ఆయా ప్రాంతాల్లోని భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతుకు నష్టం కలగకుండా మార్కెట్ ధరను నిర్ధారిస్తామన్నారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాలలో జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా శుక్రవారం సర్వేహద్దు రాళ్లను పాతే విధానాన్ని జేసీ సంపత్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే పనులు చేపట్టిందన్నారు. ప్రభుత్వం రైతుల మధ్య గొడవలు జరగకుండా రీ సర్వే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు, జిల్లా సర్వే అధికారి కసూర్యారావు, నందిగామ డివిజనల్ సర్వే ఎస్ రవీంద్ర ప్రసాద్, తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, డీటీ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టండి

పీడీ డీఆర్డీఏ శ్రీనివాసరావు



తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న పీడీ డీఆర్డీఏ కె.శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: జగనన్న కాలనీల్లో నిర్మాణాలను ఇప్పటి వరకు మొదలు పెట్టని లబ్ధిదారులు త్వరలో ప్రారంభించాలని పీడీ డీఆర్డీఏ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పేట మున్సిపాలిటీ కమిషనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికి వరకు నిర్మాణాలు మొదలుపెట్టని లబ్ధిదారులు 4,332 మంది ఉన్నారని, వారంతా ఈనెల 27, 30 తేదీలు, మే నెల 1 వ తేదీన ఉన్న ముహూర్తాల్లో గృహాల నిర్మాణాలు మొదలుపెట్టాలని సూచించారు. వారిని మోటివేట్ చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. సమావేశంలో పేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, పేట మండల ఎంపీడీవో జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

– ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న నిరుద్యోగులను గుర్తించి వారు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందేలా సచివాలయ సెక్రటరీలో ప్రోత్సహించాలని పీడీ డీఆర్డీఏ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీఆర్వోల భవన్‌లో సచివాలయ సెక్రటరీలు, బీఎల్‌వోలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ముస్లింల అభివృద్ధి



చాపలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ఫౌండేషన్ చైర్మన్ విమలభాను

జగ్గయ్యపేట అర్బన్: ముస్లిం మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్ సీపీ హయాంలోనే జరుగుతోందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక బలుసుపాడు రోడ్డులో ఉన్న ఈద్గాలో వారు నమాజు చేసుకునేటప్పుడు నేలపై ఇబ్బందులు పడకుండా ఉండటానికి స్థానిక విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 1.85 లక్షల వ్యయ అంచనాతో కేరళ నుంచి చిరు చాపలు(జానేమజ్)ను తెప్పించారు. శుక్రవారం రాత్రి స్థానిక షాదీఖానాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను ఈద్గా కమిటీ సభ్యులకు చాపలను అందజేశారు. ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ఇటీవల ఈద్గా అభివృద్ధికి రూ 50 వేలు ఇచ్చామని తెలిపారు. విమలాభాను మాట్లాడుతూ ముస్లింలకు కేరళ నుంచి చిరు చాపలను తెప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ అక్బర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రసహుస్సేన్, జామియా మసీదు ప్రెసిడెంట్ షేక్ జలీల్, వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, ఈద్గా ప్రెసిడెంట్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మొహిద్దీన్, షాదీఖానా ప్రెసిడెంట్ ఎక్బైన్డ్ బాషా, దర్గా కమిటీ ప్రెసిడెంట్ ఖాజా పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో పోటీతత్వం అలవర్చుకోవాలి



మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సాంకేతిక జాతీయ ప్రదర్శనలో విద్యార్థులు

కంచికచర్ల: విద్యార్థులు పోటీతత్వంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కొత్త ఆవిష్కరణలు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ అన్నారు. కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఐ ఈ టీ ఈ, ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాంకేతిక జాతీయ ప్రదర్శన జరిగింది. పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఆవిష్కరణలు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, దేశానికి ఇంజినీరింగ్ విద్యార్థులు చాలా అవసరమని సాంకేతిక పరమైన ఆవిష్కరణలు చేయాలన్నారు. ముఖ్యంగా పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంకేతిక పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేసింది. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యుడు ఎం.హాన్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ పుల్లారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతో చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసాతో పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వలసలుగా వస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చిల్లకల్లుకు చెందిన పాము రంగా, షేక్ మౌలాలీ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే ఉదయభాను సమక్షంలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల మండల సంఘం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన సంఘ నాయకులు

కంచికచర్ల: ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ కంచికచర్ల ఉద్యోగుల సంఘ ఎన్నికలు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగాయని ఎన్నికల అధికారి డి.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయన్నారు. కంచికచర్ల పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఆర్‌సీహెచ్ పుల్లయ్య, ఉపాధ్యక్షులు బి.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.సిరిదేవమ్మ, జిల్లా కౌన్సిలర్-1 షేక్ మస్తాన్ సాహెబ్, జిల్లా కౌన్సిలర్-2 ఆర్‌జగణేషరావు ఎన్నికయ్యారన్నారు. ఎన్నికైన సంఘ అధ్యక్షుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్‌లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు ఎం.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

పెద్దాపురం(వీరులపాడు): పెద్దాపురంలోని ఏహెచ్‌యూపీ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ కోచింగ్ విద్యార్థులకు నున్న వికాస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాల సహకారంతో మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు ఉచిత పాలీసెట్ కోచింగ్ ఇవ్వటం అభినందనీయం అన్నారు. తమ వంతు బాధ్యతగా విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అందిస్తున్నామని చెప్పారు. పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 70 మందికి పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ సెట్ కు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేశారు.